
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 27 అక్టోబర్ 2025
5
చిత్తూరు




కర్నూలు బస్సు ప్రమాదంలో గుడిపల్లి వాసి మృతి


మృతుడు త్రిమూర్తి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి- గుడిపల్లి : కర్నూలు బస్సు ప్రమాదంలో చిత్తూరు జిల్లా గుడిపల్లి (ఎం) యామిగానిపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత త్రిమూర్తి(58) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. త్రిమూర్తి బుధవారం హైదరాబాదులో బంధువుల వివాహానికి హాజరుకావడానికి కుప్పం నుంచి బయలుదేరి వెళ్లారని, గురువారం రాత్రి హైదరాబాదు నుంచి బెంగళూరుకు కావేరీ ట్రావెల్స్ బస్సులో బయలుదేరినట్లు ఫోన్ చేశారని తెలిపారు. ఆయన ఫోన్ హైదరాబాద్ నుండి కర్నూలు శివారు చిన్నటేకూరు వరకు సిగ్నల్ ఉందని, రెండురోజులుగా ఎటువంటి సమాచారం లేకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు మృతుడి కుమారుడు తెలిపారు. కర్నూలు వద్ద జరిగిన ప్రమాదంలో మృతదేహాలు దగ్ధం అయ్యాయని డిఎన్ఏ పరీక్ష ద్వారా గుర్తించాల్సి ఉందని పోలీసులు తమకు సమాచారం ఇచ్చారని, దీంతో డిఎన్ఏ పరీక్ష నిమిత్తం కర్నూలుకి వెళ్లినట్లు తెలిపారు. డిఎన్ఏ పరీక్ష ద్వారా తిమూర్తి మృతదేహాన్ని గుర్తించి ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగిస్తారని, సోమవారం ఉదయం అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామం యామిగానిపల్లికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఇతనికి గుడిపల్లి మండలంలో క్వారీ ఉంది.

దూసుకొస్తున్న 'మొంథా'

తుపాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంకండి
అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు ఆదేశం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మొంథా తుపాన్ రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ తీసుకున్నారు. వాయుగుండం 28వ తేదీ ఉదయం నాటికి తీవ్రమైన తుఫానుగా మారుతుందని, ఈ సమయంలో ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం నుంచి కాకినాడ ప్రాంతం వరకు తుఫాన్ తీవ్రప్రభావం చూపిస్తుందని, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలని సీఎం చెప్పారు. ఎస్ఎంఎస్ అలర్ట్స్, సోషల్ మీడియా, ఐవీఆర్ఎస్ కాల్స్, వాట్సాప్‌ల ద్వారా ప్రజలకు ముందస్తుగా హెచ్చరికలు పంపించాలన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు తుపాన్ ప్రభావంపై సమాచారం వేగంగా చేరవేసి, నష్టనివారణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే తీర జిల్లాలలో మోహరించామన్నారు. తుఫాన్‌పై ప్రెడిక్టివ్ మోడల్, రియల్ టైమ్ డేటా ఆధారంగా విశ్లేషణ చేస్తున్నామన్నారు. రిజర్వాయర్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు.

పవర్ సా, జేసీబీలు, క్రేన్లు సిద్ధం చేయండి

రాష్ట్రవ్యాప్తంగా 27,000 సెల్ టవర్లను డీజిల్ జనరేటర్లతో సిద్ధం చేశామని ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. సముద్ర తీరప్రాంత ప్రజలను తక్షణమే సమీపంలోని తుపాన్ రక్షణ కేంద్రాలకు తరలించి పునరావాసం కల్పించాలని సూచించారు. తుపాన్ తీవ్రతను బట్టి విద్యాసంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించాలన్నారు. రహదారులు, చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. చెట్లు కూలిపోయినా, కొమ్మలు విరిగిపడినా వాటిని తొలగించడానికి అవసరమైన పవర్ సా, క్రేన్‌లు, జేసీబీలు ప్రతీ సబ్ డివిజన్ స్థాయిలో సిద్ధం చేయాలని, డ్రోన్ల ద్వారా సహాయక చర్యలు చేపట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. అయితే తుపాన్ రక్షణ చర్యలపై ఇప్పటివరకు 11 సార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వాహనాలు సిద్ధం చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 851 జేసీబీలు, అలాగే క్రేన్‌లు – పవర్ సాలు 757 అందుబాటులో ఉంచామని వెల్లడించారు.

అధికారులు ముందస్తు చర్యలు చేపట్టండి : ఎంపీ

'మొంథా' తుపాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు. అంతేకాకుండా ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం జాగ్రత్త చేపట్టాలని ఎంపీ తెలియజేశారు. తుపానును ఎదుర్కోవడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఎంపీ ఆదేశించారు. తుపాను వల్ల కలిగే నష్టం అంచనా, పరిహారం, దాని పంపిణీ, పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు ప్రత్యేక అధికారులు తమ విధులను సక్రమంగా కొనసాగించాలని సూచించారు. చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురానికి చెందిన నలుగురు బాలురు సరదాగా ఈత కెళ్ళి స్వర్ణముఖి నదిలో గల్లంతై, విగత జీవులుగా మారడంపై ఎంపి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జిల్లా ప్రత్యేక అధికారిగా పిఎస్.గిరీష



మొంథా తుపాను నేపథ్యంలో కలెక్టర్‌కు సహాయ సహకారాలు అందించడానికి చిత్తూరు జిల్లాకు ప్రత్యేక అధికారిగా పిఎస్.గిరీషను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తుపాను ప్రభావం తగ్గి సాధారణ పరిస్థితులు వచ్చేంత వరకు జిల్లాలో ఆయన విధులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

నేడు పాఠశాలలకు సెలవు

జిల్లా కలెక్టర్ చిత్తూరు ఆదేశాల ప్రకారం మొంథా తుపాను కారణంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సోమవారం 27 తేదీ సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.వరలక్ష్మి ఆదివారం ప్రకటనలో తెలిపారు. డీవైఈవో, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని యాజమాన్య పాఠశాలలు సెలవు అమలు చేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల కారణంగా వాగులు, వంకల్లో నీటి ప్రవాహం అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెలవు రోజున విద్యార్థులు వాగులు, వంకలు, చెరువుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

సోమవారం కలెక్టరేట్లో జరగవలసిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రానున్న తుపాన్ కారణంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలో ఈనెల 27 నుండి 29వ తేదీ వరకు మొంథా తుపాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు విషయం గమనించుకొని ఎవరూ కూడా అర్జీలు తీసుకొని కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా కలెక్టర్ కోరారు.

పోలీస్ గ్రీవెన్స్ రద్దు

రానున్న తుపాన్ ప్రభావం దృష్ట్యా సోమవారం జరగవలసిన 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం)ను రద్దు చేసినట్లు చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి రాకుండా ఉండాలని, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

వర్షం తెచ్చిన తంట.. రాలిపోతున్న పంట

- నేలరాలుతున్న టమాటాలు
- పొలాల్లోనే వదిలేస్తున్న రైతులు


తోటల్లో నేలరాలిన టమాటాలు

ప్రజాశక్తి- సోమల

మండలంలో కురుస్తున్న భారీ వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. టమాటా సాగు చేసిన రైతులకు విడవకుండా కురుస్తున్న వర్షం కారణంగా టమాటాలకు వివిధ రకాల వైరస్లు సోకి కాయలు చెట్టు నుండి నేలరాలి మచ్చలు ఏర్పడి కుళ్లిపోతున్నాయి. మొదటి రకం నాణ్యత కలిగిన టమాటాలు బాక్స్ రూ.400లు ధర మార్కెట్లో ఉందని రెండవరకం రూ.300లు, మూడవ రకం రూ.200లు ధర పలుకుతోందని అయితే విడవకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కాయలు నాణ్యత లోపించి మచ్చలు ఏర్పడి చెట్టు నుండి వాటి అంతట అవే కాయలు రాలిపోతున్నాయని నేలరాలిన టమాటాలు కుళ్ళిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. వంకలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలు స్తంభించిన నేపథ్యంలో మండలంలోని కొన్ని పంచాయితీలలో టమాటా ఇతర కూరగాయల పంటలను కూడా కోసి మార్కెట్‌కు తరలించలేక వదిలేస్తున్నారు. విడవకుండా కురుస్తున్న వర్షాల కారణంగా టమాటా ఇతర కూరగాయల పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలియజేసేవారు కరువయ్యారు. దీంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నా చివరకు వర్షం కారణంగా నష్టాలు చవి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం

నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతోంది. నీవానది పరిసర ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పోలీస్ మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొందుకు నగర పాలకసంస్థ సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో నగర కమిషనర్ పి.నరసింహప్రసాద్ తెలిపారు.

ప్రజాశక్తి: వర్షాల నేపథ్యంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు..?

కమిషనర్: దాదాపు 15 రోజులకు పైగా కురుస్తున్న ఎడతేరిపి లేని వర్షాల కారణంగా నీవానది పరిసర ప్రాంతాలైన కైలాసపురం, దోబీఘాట్, వీరభద్రకాలనీ, తేనండ ప్రాంతాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం జరుగుతోంది. లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తూ పర్యవేక్షించడం జరుగుతోంది.

ప్రజాశక్తి: నగర పాలక సంస్థ ద్వారా ఎలాంటి సహాయం అందుతోంది..?

కమిషనర్: అధిక వర్షాలతో నగరంలోని 50 డివిజన్స్‌లోని ప్రజలు ఎలాంటి ఇబ్బంది ఉన్న సంప్రదించేలా నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. సహాయం కోసం 9849907885 ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. పారిశుధ్య లోపం ఏర్పడకుండా పారిశుధ్య కార్మికుల ద్వారా మురికి కాలువలను శుభ్రం చేయడం జరుగుతోంది.

ప్రజాశక్తి : ప్రస్తుతం నీవానది పరిస్థితి ఎలా ఉంది..?

కమిషనర్: నీవానదిలో పై నుండి వస్తున్న వర్షపు నీటితో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. దాదాపు 30 నివాసాల్లోకి వరద నీరు చేరడంతో ఎలాంటి ప్రమాదం సంభవించకుండా ఇండ్లను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించడం జరిగింది. ఇలా పునరావాస కేంద్రంలో ఉన్న వారికి అల్పాహారం, భోజనం అందించడం జరుగుతోంది. దాతల సాయంతో దుప్పట్లు, ఇతర నిత్యావసరాలు అందిస్తుం. నీవానదిలో వరద నీటి ఉధృతి పెరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగింది. ఆ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ రాత్రిసమయాల్లో యువకులను గస్తీ ఉంచుతున్నాం.

ప్రజాశక్తి: ఇప్పటి వరకు నీవానదిలో ఎలాంటి ప్రమాదాలు సంభవించాయి..?

కమిషనర్: నీవానదిలో చిక్కుకున్న యువకుడిన్ని పోలీసుల సహాయంతో కాపాడం జరిగింది. నది దాటే సమయంలో ప్రజలకు ఇబ్బంది పడకుండా తేనబండ వద్ద రోప్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు, నగరపాలక సిబ్బందని ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. చిన్న పిల్లలు, వృద్ధులకు నది దాటే సమయంలో మున్సిపల్ సిబ్బంది సాయం చేస్తున్నారు.

ప్రజాశక్తి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కమిషనర్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో శనివారం రాత్రి నీవానది పరిసర ప్రాంతాల్లో పర్యటించడం జరిగింది. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్, నగర మేయర్, జిల్లా కలెక్టర్ ఇతర ప్రజాప్రతినిధులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతోంది. సంతపేట, ఇతర ప్రాంతాల్లో ఆవాసాలు, రోడ్లపై నిలిచిపోయిన వర్షపు నీటిని జేసిబిల ద్వారా నీవానదిలోకి పంపుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటూ సహాయక చర్యలో పాల్గొంటున్నారు. వరద నీరు నీవానదిలో పారేందుకు ఉన్న చిన్న చిన్న అడ్డకుంలను జేసీబీ ద్వారా తొలగించడం ద్వారా సాఫీగా వరద నీరు పారుతోంది.

పోలీస్ ఆయుధాల ప్రదర్శన


పోలీస్ ఆయుధాలను చూపుతున్న జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతిఏటా అమరవీరులైన పోలీసులను స్మరించుకుంటూ రెండు రోజుల పాటు నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ప్రారంభించారు. జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలో ఉంచారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యంగా ప్రజల్లో పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంపొందించడం, పోలీసుల కష్టసాధ్యమైన విధులకు సవరణ పొందేలా చేయడం లక్ష్యంగా నిర్వహించారు. విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు తమ నిత్య జీవితంలో ఎదుర్కొనే సవాళ్లను, వారు ఉపయోగించే ఆయుధాలను నేరుగా చూడగలిగే అవకాశమన్నారు. పోలీసు విభాగంలోని ప్రతి విభాగం తీరుపై అవగాహన కలిగించడం ద్వారా విద్యార్థుల్లో సమాజసేవ పట్ల ఆసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విభిన్న విభాగాలను పరిశీలించే అవకాశం కలిగిన విద్యార్థులకు ఏఆర్ సిబ్బంది ఆయుధాల వివరణ అందించారు. ఆయుధాల వినియోగ విధానాలు, ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధాలు వాడవలసి ఉంటుందో ఆ ఆయుధం ఎలా పనిచేస్తుందో సిబ్బంది తెలిపాలన్నారు.

ప్రదర్శనలో ఉంచిన విభాగాలు..

ఈ ప్రదర్శనలో వివిధ విభాగాలను ఆకర్షణీయంగా అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా డాగ్ స్క్వాడ్ ద్వారా పోలీసు దర్యాప్తుల్లో డాగ్ స్క్వాడ్ పాత్రను ప్రదర్శించారు. ఆయుధాల ప్రదర్శనలో పోలీస్ బలగాలు వినియోగించే ఆయుధాలు, వాటి వినియోగ పద్ధతుల గురించి వివరించారు. బాంబు డిటెక్షన్ స్క్వాడ్ విభాగంలో అత్యవసర పరిస్థితుల్లో బాంబులను గుర్తించే విధానాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. కమ్యూనికేషన్ విభాగంలో పోలీసుల మధ్య సమాచార మార్పిడి విధానాలు, ఆధునిక రేడియో పరికరాల ప్రదర్శన చేశారు. ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం విభాగం ద్వారా నేరాల విచారణలో ఆధారాలను సేకరించే తీరును వివరించారు. ట్రాఫిక్ విభాగంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో ఉపయోగించే పరికరాలు ప్రదర్శించారు. అధునాతన డ్రోన్ స్టాల్ ను ప్రదర్శించి, ప్రస్తుత సమాజంలో నేరాలను అరికట్టడానికి డ్రోన్ వినియోగంపై విద్యార్థులకు వివరించడం జరిగింది. సైబర్ క్రైమ్ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, సైబర్ నేరాలపై యువతలో అవగాహన పెంచడానికి సైబర్ భద్రతా చిట్కాలు అందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ వాహనాల ప్రదర్శన ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది. ఇందులో ఫాల్కన్ వాహనం, మినీ ఫాల్కన్ వాహనం సహా ఇతర పోలీసు వాహనాలు ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్.శివానంద కిషోర్, చిత్తూరు సబ్–డివిజన్ డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, 1 టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర, క్రైమ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర రావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐలు సుధాకర్, వీరేశ్, ఎస్సైలు, ఆర్.ఎస్సైలు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, ఏఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్ ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడి

గోడ కూలి కూలీ మృతి


భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని ధర్మపురి గ్రామంలో ఆదివారం గోడ కూలి ఒకూలీ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ధర్మపురి గ్రామానికి చెందిన దళిత యువకుడు గంగాధర్ (31) గ్రామంలోని మాజీ సర్పంచ్ భాస్కర్ ఇంటి పాత గోడ పక్కన నిలబడి ఉన్న సమయంలో ఒక్కసారిగా గోడ కూలింది. గోడ కింద చిక్కుకున్న గంగాధర్‌ను వెంటనే స్థానికులు శిథిలాల నుంచి బయట తీయగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. గంగాధర్ కూలీ పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు. తండ్రి గుర్రప్ప, భార్య భవాని, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కుటుంబానికి ఆధారం అయిన గంగాధర్ మరణంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఈ ఘటనతో గ్రామం తీవ్రవిషాదంలో మునిగిపోయింది. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ మేయర్ జంట హత్యకేసులో

నిందితులకు నేడు శిక్ష ఖరారు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 2015 నవంబర్ 17వ తేదీ నగరపాలక సంస్థ కార్యాలయంలో చోటు చేసుకున్న నాటి నగరం మేయర్ కటారి అనురాధ, కటారి మోహన్ హత్యకేసులో ఐదు మందిని ప్రధాన నిందితులుగా తొమ్మిదవ అదనపు కోర్టు నిర్ధారించింది. ఏ 6 నుండి ఏ 23 వరకు ఉన్న ముద్దాయిలు శిక్షకు అనర్హులుగా కోర్టు తేల్చిన విధేయతమే. మేయర్ జంట హత్య కేసులో ఏ 1 నుండి ఏ 5 ముద్దాయిలు చంద్రశేఖర్ అలియాస్ చింటూ, వెంకటా చలపతి, జయప్రకాశ్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్ ఐదుగురికి సోమవారం శిక్ష ఖరారు కానుంది. మేయర్ అనురాధ దంపతుల హత్యకేసులో నేరనిరూపణ అయిన ఐదు మందికి రేపు శిక్ష ఖరారు చేయనున్న సందర్భంగా శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చూడాలని చిత్తూరు 1 టౌన్, 2 టౌన్, తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడమైనది. నగర మునిసిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ హత్య కేసులో 24న 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి చిత్తూరు నుండి 5 మందికి శిక్ష ఖరారు చేయనున్న నేపథ్యంలో పోలీసులు విస్తృత భద్రతా పరమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జిల్లా కోర్టు పరిసరాల్లో కోర్టు సిబ్బంది, లాయర్లకు తప్ప మరెవరూ అనుమతించబడరిన, పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉంటుందని, సహకరించాలని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ కోరారు.

కుప్పంలో పారిశ్రామిక ప్రగతి

- పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తున్న పారిశ్రామికవేత్తలు
- 28న వర్చుల్ విధానంలో 7 పరిశ్రమలకు సీఎం శంకుస్థాపన
- రూ.2,203 కోట్ల పెట్టుబడితో దాదాపు 22 వేల మందికి ఉపాధి

ప్రజాశక్తి- కుప్పం

ద్రావిడ రాష్ట్రాల కూడలిలోని కుప్పం ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉండడంతో రవాణా సౌకర్యాలు సైతం మెండుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎం నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మౌలిక వసతులతో పాటు అన్ని అనుమతులు త్వరితగతిన వస్తాయన్న ఆశాభావంతో పారిశ్రామికవేత్తలు కుప్పంలో పరిశ్రమలు ఏర్పాటుకు క్యూ కడుతున్నారు. వందల కోట్ల పెట్టుబడితో పరిశ్రమల ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ప్రత్యక్ష, పరోక్ష పద్ధతిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు.

కుప్పంలో 7 పరిశ్రమలకు సీఎం శంకుస్థాపన

కుప్పం నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల్లో 7 పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో 28వ తేదీ మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. కుప్పం ప్రాంత పారిశ్రామిక వికాసం దిశగా ప్రగతి పథంలో ముందడుగులో భాగంగా రూ.2,203కోట్ల పెట్టుబడితో దాదాపు 22 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు రానున్నాయి.

ఏ పరిశ్రమ ఎక్కడంటే..?

కుప్పం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో భాగంగా నాలుగు మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. కుప్పం మండలం పలార్లపల్లి వద్ద అలీఫ్, అనిమిగానిపల్లి సమీపంలో ఆదిత్య బిర్లా, శాంతిపురం మండలం తంబి గాని పల్లి వద్ద మదర్ డైరీ, రామకుప్పం మండలం విజలాపురం వద్ద ఈ రైస్, గుడిపల్లి మండలం పొగురుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో ఏసీఈ, శ్రీజ డెయిరీ, ఎస్వీఎఫ్ సోయా పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు.

కుప్పంలో పిజిఆర్ఎస్ వాయిదా

కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కడ పీడీ వికాస్ మర్మత్ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రేపు వాయిదా వేసినట్లు తెలిపారు. కుప్పంలో పరిశ్రమలు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని వచ్చే సోమవారానికి వాయిదా వేసినట్లు పీడీ తెలిపారు.

పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తున్న కడ

కుప్పం ప్రాంత సమగ్ర అభివృద్ధికి ఏర్పాటైన కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కడ) పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తోంది. కుప్పం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసిన కడపిడి వికాస్ మర్మత్ నిత్యం పరిశ్రమకువేత్తలతో సమావేశాలు నిర్వహిస్తూ కుప్పంలో పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా వారిని ప్రోత్సహిస్తున్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు అనువైన వాతావరణం కలిగి ఉండడంతో పాటు పరిశ్రమలకు సంబంధించిన అన్ని అనుమతులను సకాలంలో మంజూరు చేసే విధంగా కడ విశేషంగా కృషి చేస్తుంది. కుప్పం ప్రాంత అభివృద్ధిలో కడ పిడి వికాస్ మర్మత్ తనదైన ముద్ర వేసుకోక మున్ముందు మరిన్ని పరిశ్రమలు రానున్నాయి.





పలు పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలతో ఒప్పందం చేసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు (ఫైల్ ఫోటో)

వీఓఏలకు పనిభారం తగ్గించాలి

జిల్లా మహాసభలో యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్



మాట్లాడుతున్న యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి- ఐరాల: జిల్లాలో ఉన్న వీఓఏల యూనియన్ 3వ జిల్లా మహాసభ ఆదివారం కాణిపాకంలోని ఎంఎస్ హాల్‌లో రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏపి వెలుగు విఓఏ ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాన్ని రద్దుచేసి లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతూ సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నదని తెలిపారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతి పక్షంలో వున్నపుడు అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్త పోరాట ఫలితంగా మూడు సంవత్సరాల కాలపరిమితి రద్దు చేయడం జరిగిందని పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని వీవోఏలందరూ పోరాటాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు జిల్లాలో డీఆర్డీఏ పీడీ వీవోఏల సమస్యలపై నిర్లక్ష్యంగా ఉన్నదని ఆమె వైఖరి మారడానికి నవంబర్లో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వేధింపులు మానుకోవాలని ప్రభుత్వాలు మారిన ఆ ప్రభుత్వాలు కనుగుణంగా వీఓఏలు పనిచేస్తారని తెలిపారు. డిసెంబర్లో విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలకు జిల్లా నుండి భారీ స్థాయిలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్తా మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు విఓఏలు పోరాటం చేయాలని, సిఐటియు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ బాబు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. దీనిపై సభ్యులందరూ చర్చలు జరిపి ఆమోదించడం జరిగింది. జిల్లా కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వర్ రెడ్డి, చంద్రబాబు, మునుస్వామి, జగదాంబ, వీఓఏలు పాల్గొన్నారు.

పచ్చదనం కనుమరుగు

- విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- వృక్షాల తొలగింపుతో నీడ కరువు
- ప్రత్యామ్నాయం ఏది?

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఆ గ్రామస్తులు ప్రయాణికులు కూర్చోడానికి నీడ ఉంటుందని, ఆ గ్రామానికి సంబంధించిన ఓ మంచి ఆలోచనతో అక్కడ మర్రిచెట్టు పెంచారు. ఎప్పుడో మూడు తరాల క్రితం ఓ పెద్దాయన ఆ చెట్లను ఏర్పాటు చేశారని ఆ గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే ఎన్నో ఏళ్ల వృక్షాలు విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో కనుమరుగ వుతున్నాయి. చెట్లను యథేచ్ఛగా తొలగిస్తుండడంతో పచ్చదనం కనుమరుగవుతోంది.. నీడనిచ్చే చెట్లను తొలగించడం ఆపి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలంలో గృహ అవసరాలకు, గ్రామీణ ప్రాంతాలలో చిన్నపాటి పరిశ్రమలను ప్రోత్సహించడానికి నిరంతరం కరెంటు ఉండేటందుకు ప్రతి పేను విద్యుతను సరఫరా చేస్తున్నారు. అయితే వెదురుకుప్పం నుంచి ఈ విద్యుత్ లైన్ దేవళంపేట వరకు వుంది. గ్రామాల వైపు పనులు సాగుతున్నాయి. విద్యుత్ స్తంభాలను నాటి విద్యుత్ తీగలను లాగుతున్నారు. అడ్డంగా ఉన్న చెట్లను రంపపు యంత్రం సహాయంతో కోసేస్తున్నారు. పచ్చగా వున్న ప్రకృతి సంపద మోడు బారి అందవిహీనంగా కనిపిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

భారీ వృక్షం కనుమరుగు

మండలంలోని గుర్రం వారి కండ్రిగ వద్ద ఎప్పుడో మూడు తరాలకు క్రితం ఆ గ్రామంలో ఓ వృక్ష మర్రి చెట్టును నాటాడు. వచ్చిపోయే ప్రయాణికులకు, వేసవి కాలంలో ఆ చెట్టు నీడన కూర్చొని సేద తీర్చుకుని మళ్లీ ప్రయాణం సాగించేవారు. విద్యుత్ వాళ్లు ఆ చెట్టు విద్యుత్ తీగలకు తగులుతోందని శుభ్రంగా కొమ్మలు తొలగించారు. దీంతో ఆ గ్రామంలో పాదచారులకు నీడ కరువైందని వాపోతున్నారు.

ప్రత్యామ్నాయం ఏది?



చెట్టు కరెంట్ లైనుకు తగులుతుందని అనిపిస్తే కేబుల్ వైరును అమర్చాలని, చెట్లకు అందనంత దూరంలో చుట్టూ పోలు నాటి వైర్లను వెలుపల వైపునకు లాగాలని స్థానికులు కోరుతున్నారు. వీలుంటే భూమి లోపల విద్యుత్ కేబుల్ వైర్లను అమర్చడం వంటి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సూచించారు. వృక్షాలు లేని వైపు విద్యుత్ తీగలను లాగాలని పలువురు కోరారు. సంబంధిత అధికారులు స్పందించి వృక్ష సంపద కాపాడాలని కోరుతున్నారు.

ఎస్‌పిని కలిసిన ఎమ్మెల్యే



ఎస్‌పిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చిత్తూరు ఎస్‌పి తుషార్ డూడీని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో ఎస్‌పిని సత్కరించారు. అనంతరం కొంతసేపు వారిద్దరూ వివిధ అంశాలపై చర్చించు కున్నారు. ఈ కార్యక్రమంలో బంగారుపాళ్యం మండల టిడిపి అధ్యక్షులు ఎన్‌పి ధరణీ నాయుడు పాల్గొన్నారు.

అధిక శబ్ద సైలెన్సర్ ఉంటే కఠిన చర్యలు: సీఐ

ప్రజాశక్తి -పుంగనూరు: పట్టణంలో యువత ద్విచక్ర వాహనాలకు అధిక శబ్ద సైలెన్సర్లతో తిరుగుతుంటే చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ సుబ్బరాయుడు ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. యువత అధిక శబ్దాలు చేస్తూ ప్రజలను భయాందోళన కలిగించే విధంగా ద్విచక్ర వాహనాలలో సైలెన్సర్లలో శబ్దాలు వస్తున్నాయని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వాటిని గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయడంతో పాటు వాహన యజమాని వారి తల్లితండ్రుల పై సైతం కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలో యువత ద్విచక్ర వాహనాలకు శబ్ద సైలెన్సర్లు ఉంటే వెంటనే మార్చుకోవాలని లేకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సిఐ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- రామకుప్పం: విద్యార్థి దశలోనే ఉపాధి వృత్తులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని విజలాపురం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు శివకుమార్ తెలిపారు. ఆదివారం 9 ,10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థులతో శాంతిపురం మండలంలోని గుంజాళ్లపల్లి దానియ సోలార్ పవర్ ప్లాంట్, తుమిసి లోని ఖుషి మిల్క్ డెయిరీ, శాంతిపురంలోని టీవీఎస్ షోరూంలను సందర్శించి ఉపాధి వృత్తులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, వివేకానంద, రమేష్, స్కూల్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వర్షాలకి కూలిన పూరి గుడిసె



వర్షాలకు కూలిన పూరి గుడిసె

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: వర్షానికి గోడ నాని కూలిపోయిన సంఘటన సోమవారం మండలంలో సోమ వారం చోసుకుంది. గంగాధర నెల్లూరు పంచాయతీ అక్కనగారి వల్లి ఆదిఆంధ్రవాడలో శివ కుమారి పూరి గుడిసెలో ఉంటున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూరి గుడిసె చుట్టూ గోడలు కూలిపోయాయి. ఈ సందర్భంగా ఆమె కన్నీటి పర్యం తమై అధికారులు, ప్రజా ప్రతినిధులు సహాయం చేసి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవించింది. ప్రభుత్వం తరపున కాలనీ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మగౌరవ ప్రదర్శన సభకు తరలిరండి: ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి- రామకుప్పం: హైదరాబాద్ లో నవంబర్ ఒకటిన జరిగే దళితుల ఆత్మ గౌరవ ప్రదర్శన సభకు తరలిరావాలని ఆదివారం రామకుప్పంలో ఎమ్మార్పీఎస్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎంపీ ప్రకాష్, ఎంఎస్‌పి, కుప్పం కో ఇన్‌చార్జ్ వెంకటేష్ కోరారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 7న జస్టిస్ బి ఆర్ గవాయ్‌పై అమానుష దాడిని ఖండిస్తూ నిరసనకు వాహన జన సమీకరణ చేస్తూ చేపట్టిన చలో హైదరాబాదుకు బస్సులను సమకూర్చుకొని నవంబర్ ఒకటో తేదీన హైదరాబాదులో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనకు మండలంలోని ఎమ్మార్పీఎస్ ఎంఎస్ పి అనుబంధ సంఘాలు అందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాపన్న, గోవింద,.జయప్ప, రవీంద్ర ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, పలని, రమేష్, జి వెంకటేష్, శంకర్ గణేష్, మణికంఠ, సుబ్రమణి, బాబు, ముని వెంకటప్ప, రంగప్ప, సెల్వరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా హెడ్మాస్టర్ ఉద్యోగ విరమణ



ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు మండలం పంగరగుంట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కరణం విజయ్ కుమార్ ఉద్యోగ విరమణ మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం చిత్తూరు జిల్లా నుండి కాక మదనపల్లి తిరుపతి జిల్లాల నుంచి అనేక మంది కరణం విజయ్‌కుమార్ బంధుమిత్రులు, సహోద్యోగులు, సహచరులు విచ్చేసి ఆయనతో తమకు గల అనుబంధాలను నెమరు వేసుకుంటూ ఆయన చేసిన విశేష సేవలను కొనియాడారు. పూలమాలలు, దుశ్శాలువలు, వెండి, బంగారు ఆభరణాలతో, వాచీలతో వివిధ వస్తువులతో బహుకరించి ఘనంగా సత్కరించారు. అతిథులందరికీ విందు భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా చిత్తూరు రిటైర్డ్ డివైఈవో వాసుదేవ నాయుడు పాల్గొన్నారు. పలమనేరు మండల ఎంఈవోలు లీలారాణి, బాల సుందరం, గంగవరం, పంజాణి మండల విద్యాశాఖాధికారులు, పంజాణి ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ కేశవ పిళ్ళై , మండల టిడిపి నాయకుడు నాగరాజు రెడ్డి, స్కూలు కమిటీ చైర్మన్ , తదితరులు విజయ్ కుమార్‌లు వారు వృత్తిరీత్యా చేసిన విశేష సేవలను కొనియాడారు. కరణం విజయ్ కుమార్ పలమనేరు మండల విద్యాశాఖ కార్యాలయం బాత్ రూం సౌకర్యానికి ఆర్థిక సాయం అందించడం, పని చేసిన ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు, విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రం పాఠాలపై అవగాహన కల్పించే విధంగా ఉపగ్రహ, సాటిలైట్ నమూనాను పాఠశాల ఆవరణలో రూపొందించడం తదితర వాటిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ సిబ్బంది, పెంగర గుంట పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి -పుంగనూరు: 'మొంథా' తుపాన్ దూసుకొస్తున్న నేపథ్యంలో.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. తీవ్ర అల్పపీడనం వాయు గుండంగా బలపడి, క్రమంగా పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా, సోమవారం నాటికి తుపానుగా మారే అవకాశం ఉందన్న భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండా లన్నారు ప్రధానంగా పుంగనూరు నియోజకవర్గంలో భారీ వర్షాలు పడుతుం డడంతో కొండలు చెరువులు తెగిపోయాయని రాకపోకలు ఎక్కడికక్కడ ఆగి పోయా యని. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చౌడేపల్లి , సోమల, సదుం మండలంలో కొన్ని గ్రామాలకు పూర్తిగా రాకపోకలు బంద్ అయ్యాయన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించాలని కోరారు. తుపాను వల్ల కలిగే నష్టం అంచనా, పరిహారం, దాని పంపిణీ, పునరుద్ధరణ పనులు పూర్తయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారులు తమ విధులను సక్రమంగా కొనసాగించాలని సూచించారు.

పోలీస్ కుటుంబాల పిల్లలకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 'మహిళలు, పిల్లలను లైంగిక దాడుల నుండి రక్షించడంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమాజంలో సున్నితమైన సమస్యలు క్షుణ్ణంగా అర్థం చేసుకుని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ మహిళలపై జరిగే దాడులు కేవలం చట్టపరమైన సమస్య మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యత కూడా అని గుర్తించాలన్నారు. మహిళలు, పిల్లల భద్రత కోసం ప్రతి విద్యార్థి తమ చుట్టుపక్కల నిర్వహించే అనుమానాస్పద ఘటనలపై అప్రమత్తంగా వుండి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని సమాజానికి సహకరించాలని పిలుపునిచ్చారు. మహిళలు, పిల్లల భద్రతను కాపాడడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి ఐదువేలు, ద్వితీయ బహుమతి మూడువేలు, తృతీయ బహుమతి రెండువేలు రూపాయలు విజేతలకు త్వరలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఎస్‌పి బహుమతులు ప్రదానం చేయనున్నారు.

రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి: ఏడీ

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతులందరు తక్షణమే డిజిటల్ క్రాప్ నమోదులో తమ పేర్లు నమోదు చేయించాలని ఏడీ శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ నెల 24 లోపు డిజిటల్ పంట బుకింగ్ నమోదును అన్ని రైతు సేవా కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ క్రాప్‌లో నమోదు చేసుకున్న తరువాత ఈ పంటలో నమోదు అయిందా? లేదా? అని పరిశీలించుకోవాలని సూచించారు. రైతులందరూ వెంటనే ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సిఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని బందార పల్లి పంచాయతీ, గోవిందరాజుపురం గ్రామానికి చెందిన వెంకటేష్‌కు సీఎం సహాయనిధి చెక్కును కూటమి నేతలు ఆదివారం అందించారు. వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, అప్పులు చేసి బెంగళూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. తను నిరుపేద కావడంతో సహాయం కోసం సీఎం సహాయ నిధికి అర్జీ పెట్టుకున్నాడు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రెండు లక్షల ఎనిమిది వేల రూపాయల చెక్కును అందించారు. సీఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, మునిరెడ్డి, గంట్ల రెడ్డి, పెరుమాళ్, రవి రెడ్డి, నవీన్, సతీష్, చంద్రశేఖర్ రెడ్డి, ఆదిల్, గిరి, ఆనందప్ప, చంద్రబాబు రెడ్డి ,మోహన్, మురళి పాల్గొన్నారు.

సిరి కళాక్షేత్రంలో 'రాయలసీమ ప్రేమకథ' సినిమా ఆడిషన్స్

ప్రజాశక్తి- కుప్పం: రాయలసీమ నేపథ్యంలో తెరకెక్కనున్న కొత్త సినిమా 'రాయలసీమ ప్రేమకథ' ఆడిషన్స్ కుప్పం పట్టణంలోని సిరి కళాక్షేత్రం వేదికగా ఆదివారం నిర్వహించారు. ఈ చిత్రదర్శకుడు గోపీ వర్మ, నిర్మాత రాజశేఖర్ ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేయతలుగా వ్యవహరించారు. ఈ ఆడిషన్ కార్యక్రమంలో 200 మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నట్టు సిరి కళాక్షేత్రం వ్యవస్థాపకులు అంబా మహేష్, సునీతలు తెలిపారు. యువప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ ఆడిషన్స్‌లో నటన, సంభాషణ, నృత్యం వంటి విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారికి షూటింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు. సినిమా యూనిట్ సభ్యులు మాట్లాడుతూ త్వరలోనే ఈ చిత్ర షూటింగ్ కుప్పంలో ప్రారంభమవుతుందని తెలిపారు. రాయలసీమ సాంస్కృతిక విలువలు, ప్రేమ, భావోద్వేగాలను ప్రతిభింబించే ఈ చిత్రం ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించబోతుందని తెలిపారు.

అత్యంత ప్రమాదం!

- విధిలేక వంక దాటుతున్న ప్రజలు
- వంతెన ఏర్పాటు చేయాలని వినతి



ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల నుండి నంజంపేట వెళ్లే మార్గమధ్యంలోని సరస్వతిపురం వద్ద జీడిరేవుల వంక ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వంకపై మట్టితో నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోయి ఎనిమిది రోజులు అవుతోంది. దీంతో ఆరు పంచాయతీల పరిధిలో పూర్తిగా వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా జీడిరేవుల వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. అయితే ప్రజలు నిత్యావసర సరుకులు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు వంకపై ప్రమాదం అని తెలిసినా ఉధృతంగా ప్రవహిస్తున్న వంకను దాటుతున్నారు. హెచ్చరిక బోర్డులు సిబ్బందిని నియమించాల్సిన మండల స్థాయి అధికారులు మౌనంగా వుండడంతో ప్రమాదకర పరిస్థితులలో వంకను దాటుతూ ప్రజలు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. తాత్కాలిక వంతెన నిర్మాణాన్ని చేపట్టడం చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: తహశీల్దారు

ప్రజాశక్తి-వికోట : రాష్ట్రం వైపు దూసుకొస్తున్న మొంథా తుపాన్ ప్రభావంతో కురిసే భారీ వర్షాలు పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహశీల్దారు ఉదయ్ సంతోష్ తెలిపారు. మండల పరిధిలో తుపాను ప్రభావాన్ని దృష్టిలో ప్రజలు రైతులు ముందస్తు తగు జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు. మండలంలో మొత్తం 140 చిన్న, పెద్ద చెరువులు వున్నాయని వాటిలో ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు దాదాపు 20 చెరువులు పూర్తిగా నిండగా, మిగిలిన చెరువులలో పాక్షికంగా వర్షపు నీరు చేరిందన్నారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా ప్రవహిస్తున్న కృష్ణా జలాలతో మండలంలో దాదాపు 16 చెరువులు పూర్తిగా నిండాయని, మరో నాలుగు చెరువులు ఈ ఏడాది కురిసిన వర్షాలకు నిండాయని వారు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశువులకు అవసరమైన మేత దానాలను రైతులు ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు గ్రామస్తులతో సమన్వయం చేసుకొని చెరువులు నీటి కుంటలలో నీటి ప్రవాహంపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించామని వారు తెలిపారు.

తవణంపల్లి: తుపాను ప్రభావం తీవ్రంగా వున్న కారణంగా అప్రమత్తంగా వుండాలని తవణంపల్లి తమశీల్దారు సుధాకర్ అధికారులకు సూచించారు. అధికారులతో ఆదివారం ఆయన సమావేశమై తుపాను బాధితులకు నియంత్రణ కేంద్రాన్ని తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేశారు. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో వుండాలని ఆదేశించారు. భూభాగా రహదారులు దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, ఇరిగేషన్ శాఖల సహకారంతో నీటి ప్రవాహ మార్గాలను పరిశీలించారు. అత్యవసర వైద్య చికిత్స కోసం మందులు సిద్ధం చేయాలని వైద్య శాఖను ఆదేశించారు. ప్రజలు చెరువులు, వాగులు, వంకలు నీటి నిల్వ ప్రాంతాలకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ చిరంజీవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పలమనేరు: నేటి నుండి మూడు రోజులు తుపాను వున్న కారణంగా మండల వాసులు అప్రమత్తంగా ఉండాలని పలమనేరు తహశీల్దారు ఇన్నసాథన్ పేర్కొన్నారు. చిన్న పిల్లల తలిదండ్రులు జాగ్రత్తగా వుండా లన్నారు. ప్రజలు అనవసరంగా ఇళ్ల నుండి బయటకు రావద్దని పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు తమ ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు.

కార్వేటి నగరం: రానున్న రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాల నేపథ్యంలో నిరంతరం వీఆర్‌వోలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కార్వేటి నగరం తహశీల్దార్ నాగరాజు తన సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు ఏవైనా సమస్యల వుంటే 94910 77031 నెంబరుకు ఫోను చేయాలని సూచించారు.

పలమనేరులో భారీ వర్షం

-బాలాజీ సూపర్ బజారులోకి వర్షపు నీరు
- రూ.5 లక్షల సరుకులకు నష్టం





భారీ వర్షానికి పలమనేరులో జలమయమైన రోడ్లు

ప్రజాశక్తి- పలమనేరు: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ బస్టాండ్‌లోకి విపరీతమైన నీరు చేరింది. దీంతో ఆర్టీసీ బస్టాండు ఒక పెద్ద చెరువును తలపిస్తోంది. ప్రయాణికులు, ఆటోలు, టూ వీలర్స్, బస్సులు పోవడానికి చాలా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. శనివారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షం వల్ల బస్టాండ్, రిక్రియేషన్ క్లబ్బు , బాలాజీ సూపర్ బజారు తదితర వాటిలోకి నీరు చేరడం వల్ల చాలా ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా బాలాజీ సూపర్ బజార్ అధ్యక్షుడు ఆర్ వి బాలాజీ మాట్లాడుతూ వర్షపు నీరు సూపర్ బజార్ లోపలికి రావడం వల్ల నిత్యావసర సరుకులు, స్టోర్ రూమ్‌లో వున్న సరుకులు పూర్తిగా తడిసి ముద్దయ్యాయని తెలిపారు. దాదాపు ఐదు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని ఇది మొత్తం ప్రజల సొమ్మని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాజ కాలువను ఆక్రమించుకొని దానిపై షాపింగ్ కాంప్లెక్స్ కట్టడం, జనతా బజారు ముందు వున్న రాజ కాలువ వెడల్పును తగ్గించడం, రాజు కాలువ దిశను మార్చడమే ఇందుకు కారణమన్నారు. గతంలో ఇలా ఎన్నడూ జరగలేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పాత ఇళ్లలో వున్న వారు జాగ్రత్తలు పాటించాలి

తహశీల్దారు ప్రసన్నకుమార్ హెచ్చరిక

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల పరిధిలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పాత ఇళ్ల గోడలు కూలిపోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఈ నేపథ్యంలో ప్రజల భద్రత కోసం తహశీల్దారు ఎంఎస్ ప్రసన్నకుమార్ జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'మండలంలోని అనేక గ్రామాల్లో దశాబ్దాల క్రితం నిర్మించిన పాత ఇళ్లు, పాకలు, పశువుల షెడ్లు వర్షాల కారణంగా తడిసి బలహీన మవుతున్నాయన్నారు. ఈ గోడలు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, భవనాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి' అని తెలిపారు. గత కొద్ది రోజులుగా ధర్మపురిలో గోడ కూలి పోవడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటనతో పాటు, కుప్పం సమీప ప్రాంతంలో కూడా ఇలాంటి ప్రమాదాలు జరిగి మరణాలు సంభవించినట్లు గుర్తుచేశారు. 'ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రజలందరూ ముందస్తు చర్యలు తీసుకోవాలి' అన్నారు. ఇలాంటి స్థితిలో వున్న గోడలను గుర్తించి తమ కార్యాలయానికి లేదా సంబంధిత సిబ్బందికి సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో వర్షాల కారణంగా సంభవించే ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ తమ భద్రతను ప్రాధాన్యంగా తీసుకోవాలని తహశీల్దారు ప్రసన్నకుమార్ ప్రజలను కోరారు.



చెరువు మొరవ కాలువ ఉధృతం

పోలీసు, రెవెన్యూ బందోబస్తు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు మొరవ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తోంది. పుంగనూరు తిరుపతి ప్రధాన రహదారి పక్కనే అతిపెద్ద చెరువు ఉండడం నిండుగా నీరు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. దీంతో రోడ్డు మార్గంలో వెళ్లేవారు సోమల పరిసర ప్రాంతాలకు చెందిన ప్రకృతి ప్రేమికులు మొరవ కాలువ వద్దకు వెళ్లి ప్రమాదకర నీటి ప్రవాహంలో ఈత కొట్టడం, సెల్ఫీలు, రీల్స్ చేయడం చేస్తుండడంతో తహశీల్దారు మధుసూదన్, ఎస్ఐ శివశంకర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది మొరవ కాలువ వద్ద బందోబస్తు నిర్వహిస్తూ ఎవరిని రానీయకుండా నిఘా వుంచారు.



కట్టమీద పలుచోట్ల అడ్డంగా కంపలు వేసి వాహనాలు ప్రజలు వెళ్లకుండా ఏర్పాటు చేశారు.

తహశీల్దారు వివరణ

తహశీల్దారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ మొంథా తుపాన్ ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్న పిల్లలను చెరువు లు కుంటల వద్దకు వెళ్లనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలనిసూచించారు. తహశీల్దారు, సచివాలయాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు చర్యలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు.. మొంథా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు కుమారస్వామి యాదవ్, ఎమ్మెల్యే కార్యాలయం సిబ్బంది, మున్సిపల్, పోలీసు అధికారులను సమన్వయం చేసుకొని సంతపేట, వీరభద్ర కాలనీ, తేనెబండ ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. 6వ వార్డు కనికాపురం చెరువులో నీటిమట్టం పెరగడంతో స్థానికులను అప్రమత్తం చేశారు. నిల్వ నీరు వెళ్లేందుకు వీలుగా కాలువలో అప్పటికప్పుడే పూడిక, అడ్డంకులు తీయించారు.

గుడిపాల మండలంలో...

గుడిపాల మండలం నంగమంగళం గ్రామ పంచాయతీ గురుగునత్తం గ్రామానికి వెళ్లే దారిలోని అండర్ రైల్వే బ్రిడ్జి నీటితో నిండిపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. నిల్వ నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. విషయం రైల్వే అధికారులకు తెలియజేసి సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సీఐ మహేశ్వర్, వార్డు కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇతడిని గుర్తించిన వారు బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని మృత దేహాన్ని పోస్టుమార్టం గదిలో ఉంచామని ఆచూకీ కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు.

రైలు ఢీ గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి-కుప్పం: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఓ గుర్తు తెలియని మహిళ రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మహిళకు సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే 9000716436, 8074088806 ఫోను నెంబర్లకు తెలపాలని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనం వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తవణంపల్లి: ద్విచక్రవాహనం డివైడర్‌నుఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..ఎగువ తవణంపల్లి మండలం అమరరాజా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న నాగరాజు బైక్‌లో వస్తుండగా అదుపుతప్పి ఐరాల మండలం చిగరపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



టిడిపి నేతకు నివాళులర్పిస్తున్న నాయకులు

టిడిపి నేతకు నివాళి

ప్రజాశక్తి- రామకుప్పం: బందార్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత పద్మనాభం తండ్రి వెంకటేశప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కూటమి నేతలు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం గా ఉండాలని తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, ముని రెడ్డి, పెరుమాళ్, శ్రీనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, కోదండ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మురళీమోహన్, ఆనందప్ప పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు: కమిషనర్



ప్రజాశక్తి- పలమనేరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, మొంథీ తుపాను రీత్యా ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం మునిసిపల్ కమిషనర్ ఎన్వీ రమణా రెడ్డి వర్షాభావ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. లోతట్టు, ముంపు ప్రాంతాలైన పెద్ద చెరువు, రాధా బంగాళా, రఘువీర రెడ్డి కాలనీ, ఎద్దుల చెరువు, బొమ్మిదొడ్డి చెరువు తదితర ప్రాంతాలను పరిశీలించారు. గంటావూరు, ఇందిరమ్మ కాలనీలో పాడైపోయిన రోడ్లను తనిఖీ చేశారు, తక్షణ చర్యలలో భాగంగా జెసిబి ద్వారా గుంతలను పూడ్చి, రాకపోకలకు అనువుగా దారులను చదును చేయించారు. లక్ష్మి నగర్ కాలనీ, గంటావూరు, దండపల్లి రోడ్డు తదితర ప్రాంతాలలో రోడ్లు, కాలువలను పరిశీలించారు. పురపాలక సంఘం కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు టోల్ ఫ్రీ నెం.7337388215కు వెంటనే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ వెంట ఎంఆర్ఓ ఇన్నునాథన్, ఇరిగేషన్ డీఈఈ చోక్ల నాయక్, అసిస్టెంట్ ఇంజనీర్ ఆర్.స్నేహప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మండలం చెక్కునత్తం గ్రామంలో ఆదివారం కుప్పం శ్రీ ప్రియ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరంలో నిర్వహించారు. కుప్పం డీఎస్పీ పార్థసారథి, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి మణి వైద్యశిబిరంను ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంకు ప్రజల నుండి విశేషస్పందన రాగా 250 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. అదే విధంగా మెరుగైన వైద్యం కోసం 50మందిని రెఫర్ చేసినట్లు మణి తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో శుభ పరిణామం అని ఆసుపత్రి అధినేత డాక్టర్ సుధీర్‌ను ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం అభినందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజగోపాల్, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మాజీ ఎంపీపీలు సాంబశివమ్, వెంకటేష్, సంతోష్, ప్రియ నర్సింగ్ హోమ్ డాక్టర్స్ డాక్టర్లు వెంకటేష్, వెంకటలక్ష్మి, సౌరబ్ కులకర్ణి, సుబ్బారెడ్డి, ప్రశాంత్, సూర్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఆర్గానిక్ మేళాకు హరికృష్ణ



ప్రజాశక్తి -పెనుమూరు: ప్రముఖ ప్రకృతి రైతు, పులిగుంటీశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పసపల హరికృష్ణా రెడ్డికి న్యూ ఢిల్లీలోని భారత కళా మండపంలో నిర్వహించే అంతర్జాతీయ ఆర్గానిక్ మేళాలో పాల్గొనేందుకు ఆహ్వానం లభించింది. 2025 భారత ప్రభుత్వం న్యూఢిల్లీలో ఈనెల 30 నుండి 31 వరకు నిర్వహించే ప్రపంచ ప్రకృతి పంటల మేళాకు ఆయనను ఆహ్వానించారు. హరికృష్ణారెడ్డి రైతు సాధికార సంస్థలో చిరుద్యోగిగా పనిచేస్తూ ,తనకెంతో ఇష్టమైన, అభిరుచి కలిగిన ప్రకృతి వ్యవసాయంలో గత దశాబ్ద కాలంగా వివిధ పంటలు పండిస్తున్నారు. ఇటీవల పులిగుంటీశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని నెలకొల్పి 600 మంది రైతులను సభ్యులుగా చేర్చి ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులకు అందిస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు, మహిళా సంఘాల సభ్యులకు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. తాను పండిస్తున్న పళ్ళు, కూరగాయలు,చిరుధాన్యాలు దేసీ వరి రకాలు సొంతంగా మార్కెట్ చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించి రైతు నేస్తం ఫౌండేషన్2020లో అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా రైతు నేస్తం పురస్కారం అందించారు. నేడు అంతర్జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న ప్రకృతి పంటల మేళాకు ఆయనకు ఆహ్వానం రావడం అభినందన నియమని పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేళాలో హరికృష్ణా రెడ్డి తాను పండిస్తున్న పంటలను, విలువ ఆధారిత వంటలను న్యూఢిల్లీ మేళాలో ప్రదర్శించనున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరు కానున్నారు.